క్లుప్తంగా

ఆలయాల్లో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీగజ్జలమ్మదేవి, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అర్చకులు నగేష్, గురుస్వామి కడార్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, అప్పారావుపేట్, శివుని, మలక్ జాం, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్పీని కలిసిన ఆమ్ఆద్మీ నాయకులు



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిలను ఆమ్ఆద్మీ పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్, భైంసా పట్టణ కన్వీనర్లు సయ్యద్ హుజూర్, రవీందర్, నిర్మల్ నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ ఇలియాస్ తదితరులు ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ



ముధోల్: మండలకేంద్రంలోని కోలిగల్లీలో ఆదివారం విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రజలు నిత్యం సంచరించే ఈ రోడ్డుపై విద్యుత్ తీగలు పడడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. అధికారులు వెంటనే పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు విద్యాసాగర్

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో ఆదివారం శ్రీఆదిత్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యుడు విద్యాసాగర్ రోగులకు 2డీ, ఈకో, ఈసీజీ, తదితర పరీక్షలు చేపట్టారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వీడీసీ సభ్యులు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి సామాజిక తనిఖీ గ్రామసభలు

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి 14వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. 8న వడ్యాల్ తండా, 9న పొట్టపెల్లి(కే), బోరిగాం, తిర్పెల్లి, పీచర, ధర్మారం, న్యూకంజర్, మునిపెల్లి, 10న కనకాపూర్, వడ్యాల్, నర్సాపూర్, పార్‌పెల్లి, బాబాపూర్, చింతల్‌చాంద, చామన్‌పెల్లి, మల్లాపూర్‌లో గ్రామసభలు ఉంటాయన్నారు. 11న లక్ష్మణచాందలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉంటాయని పేర్కొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



తొలగిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కుభీర్: మండల కేంద్రంలోని నరసింహస్వామి ఆలయం చుట్టు ఉన్న పిచ్చిమొక్కలను ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తొలగించి శుభ్రపర్చారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కె.శ్రీనివాస్, గంగన్న, వెంకటి తదితరులు ఉన్నారు.

బస్టాండ్ నిర్వహణ అస్తవ్యస్తం..!

- ఇష్టారీతిన వాహనాల పార్కింగ్
- మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా పరిసరాలు
- ప్రయాణికులకు సౌకర్యాలు కరువు



ప్రధాన మార్గంలో వాహనాల పార్కింగ్

భైంసాటౌన్: భైంసా ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బస్టాండ్ ఆవరణలో కనిపిస్తున్న దృశ్యాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మహాలక్ష్మి పథకం ప్రారంభంతో మహిళలు, యువతులు, విద్యార్థినులు అధికసంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. కాగా, పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రయాణికులు బస్టాండ్‌లోకి వచ్చే ప్రధాన మార్గంలో కొందరు ఇష్టారీతిన బైక్‌లు నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సైకిల్‌స్టాండ్ ఉన్నా స్థలం సరిపోవడం లేదు.
- బస్టాండ్ ఆవరణలో ఇష్టారీతిన చిరు దుకాణాలకు అనుమతి ఇవ్వడంతో ఖాళీ స్థలం లేకుండాపోయింది. ఆయా దుకాణ నిర్వాహకులు ఆరుబయట వస్తువులు పెడుతుండడంతో దారి ఇరుకుగా మారింది.
- ఇదివరకు ప్రాంగణ ఆవరణలో ఖాళీస్థలాల్లో చుట్టూ ఫెన్సింగ్ వేసి మొక్కలు పెంచడంతో ఆహ్లాదంగా కనిపించేది. ప్రస్తుతం వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి.
- బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలున్నా కొందరు ఆవరణలోని బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందులు ఆవరణలోనే సంచరిస్తున్నాయి.
- ప్రయాణికులకు తాగునీటి వసతి సైతం లేకపోవడంతో దుకాణాల్లో వాటర్ పాకెట్లు, బాటిళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. దాతలు అందించిన వాటర్ చిల్లర్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.
- మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరగగా, అందుకనుగుణంగా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు, వృద్ధులు నిల్చో లేక ఇబ్బంది పడుతున్నారు. ఫ్యాన్లు, టీవీలు పనిచేయడం లేదు.



నిరుపయోగంగా వాటర్ చిల్లర్



మొక్కలు ఎండిపోయి బహిరంగ మూత్ర విసర్జనతో అధ్వానంగా పరిసరాలు

కుర్చీలు సరిపోవడం లేదు

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటున్నది. బస్సుల కోసం వేచి ఉండలేక కూర్చుందామంటే కుర్చీలు సరిపోవడం లేదు. వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు నిల్చో లేక ఇబ్బంది పడుతున్నరు. తాగునీరు కూడా ఉంటలేదు. కుర్చీలు ఏర్పాటు చేసి, తాగునీటి వసతి కల్పించాలి.

– సాయినాథ్, ప్రయాణికుడు, భైంసా

వసతులు కల్పించాలి

బస్టాండ్ ఆవరణలో పచ్చదనం కనిపించడంలేదు. మొక్కలన్నీ ఎండిపోయాయి. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన, పందుల సంచారంతో దుర్గంధం వస్తోంది. ప్రయాణికుల కోసం కనీస వసతులు కల్పించాలి.

– మహేశ్‌చారి, స్థానికుడు, భైంసా

అయోధ్య అక్షింతలు పంపిణీ



ధర్మోరలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ్‌రెడ్డి



భైంసారూరల్: శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామాల్లో ఆదివారం అయోధ్య అక్షింతలను భక్తులు ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, నాయకులు భైండ్ల సాయన్న, కథం శ్రీనివాస్‌రావు, సాయాగౌడ్, నవీన్, . సంజీవ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సాహేందర్, తెన్లు భూమన్న, ఆకుల భోజన్న, ధర్మన్న, ఒడ్డెన్న, గూండ్ల సాయన్న ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో ఆదివారం రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. దేగాం నుంచి ఉదయం 6 గంటలకు అక్షింతలు తీసుకురాగా గ్రామపొలిమేరల్లో మంగళహారతులతో స్వాగతించారు. అనంతరం పల్లకిలో అక్షింతలు ఉంచి ప్రధానవీధుల గుండా రామనామస్మరణతో శోభాయాత్ర నిర్వహించారు. మరాఠీ, తెలుగు భజనమండళిలు రామనామస్మరణ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మహాదేవుని ఆలయంలో అక్షింతలు ఉంచి హారతి ఇచ్చారు. తర్వాత అన్నదానం నిర్వహించారు.

శబరికి తరలిన అయ్యప్పలు

తానూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు ఆదివారం శబరికి తరలివెళ్లారు. తానూరులోని విఠలేశ్వర ఆలయంలో గురుస్వామి పుండలిక్ స్వామి ఆధ్వర్యంలో వారికి ఇరుముడి కట్టారు. అనంతరం గ్రామస్తులు మహిళలు హారతులతో వచ్చి స్వాములకు సాగనంపారు. గురుస్వాములు సిద్దుస్వామి పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని లింబా(బి), కుంటాల నుంచి ఆదివారం అయ్యప్ప దీక్షాపరులు శబరికి బయల్దేరి వెళ్లారు. అంతకుముందు హనుమాన్, శ్రీ ఉమామహేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్ వారికి ఇరుముడి కట్టగా మహిళలు మంగళహారతులతో సాగనంపారు. గురుస్వాములు కడార్ల హరిప్రసాద్, సిర్కార్ రాజేశ్వర్, ఉదయ్‌కుమార్, పెద్దికాపు మల్లేశ్ పాల్గొన్నారు.



తానూరు: ఇరుముడి కట్టుకుంటున్న అయ్యప్ప స్వాములు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు ఆదివారం శబరికి ప్రత్యేక వాహనాల్లోతరలివెళ్లారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో పండితులు పూజలు చేసి ఇరుముడితో భక్తులను సాగనంపారు.



బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఓలాలో బోనాల సందడి

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా రేణుక ఎల్లమ్మ (ఇప్పల ఎల్లమ్మ) ఆలయానికి చేరుకున్నారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ భూదాతలు బిల్లోల కృష్ణగౌడ్, శంకర్ గౌడ్, వినోద్‌గౌడ్, నవీన్‌గౌడ్, శరత్‌గౌడ్ ,శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు





ప్రమాదంపై పట్టింపేది?

జిల్లాకేంద్రంలోని ద్యాగవాడలో సారలమ్మ గుడి వద్ద గల్లీలో విద్యుత్ స్తంభానికి సర్వీస్ వైర్లు కిందకు వేలాడుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



అధికారులు బిజీబిజీ

కుంటాల: ఆరు గ్యారంటీల పథకాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ అధికారులు బిజీబిజీగా ఉన్నారు. 15 పంచాయతీల్లో 8,209 అభయహస్తం, 1,422 జనరల్ దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక అధికారి మసార్‌రావు, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం ఉన్నారు.



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి మసార్‌రావు

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

నర్సాపూర్(జి): అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తపాలాశాఖ, నర్సాపూర్(జి) ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ మెంబర్స్ పేర్కొన్నారు. నర్సాపూర్ (జి) ఉప తపాలాశాఖలో గత 44 ఏళ్లగా ఎం.చంద్రమోహన్ జీడీఎస్ఎండీగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆదివారం చంద్రమోహన్–నర్సమ్మ దంపతులను సన్మానించారు. ఈఆర్సీ మెంబర్స్ గడ్డం రాజేశ్వర్, బోరిగాం నరేందర్, గంగారాం, భూషణ్, చాట్ల భూమేశ్వర్, తిరుమల్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రవీణ్, సదానందం, నర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.



చంద్రమోహన్–నర్సమ్మ దంపతులను సన్మానిస్తున్న క్లబ్ మెంబర్స్

నూతన కార్యవర్గం ఎన్నిక



మున్నూరు కాపు నూతన కార్యవర్గం

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని కురన్నపేట మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పోల కృష్ణ, అధ్యక్షుడిగా అంగ మహేశ్, ఉపాధ్యక్షుడిగా అంగ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా వొడ్నం నరేందర్, సంయుక్త కార్యదర్శిగా గుర్రం సత్యనారాయణ, కోశాధికారిగా కుంటాల వేణు, సలహా సభ్యులుగా వొడ్నం మహేందర్, మానురి దాసు, కుంటాల రమేశ్, ఆకుల లక్ష్మణ్ ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.



పొట్టపెల్లి వద్ద పొలంలో కొంగలు

కొంగల పోరాటం

లక్ష్మణచాంద: ఆకలి తీర్చుకునేందుకు వివిధ రకాల జీవులు ఒక్కోరీతిలో పోరాటం సాగిస్తుంటాయి. మండలంలోని పొట్టపెల్లి వద్ద ఓ రైతు పొలాన్ని దమ్ము చేస్తున్నాడు. కేజీవీల్ వెనుక పురుగుల కోసం ఆదివారం కొంగలు పోరాటం చేశాయి. రాచాపూర్ సమీపంలో వరినారులో ఇలా నిరీక్షించడం సాక్షి కెమెరాకు చిక్కింది.



రాచాపూర్ సమీపంలో వరినారులో కొంగలు

శ్రీకృష్ణతులాభారం వేడుకలు

మామడ: ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో శ్రీకృష్ణతులాభారం వేడుకలను ఆదివారం ఘనంగా అర్చకులు ఆలయంలో విగ్రహాలను పూలతో అలంకరించి తులాభారం వేడుకలు జరిపారు.



ఘనంగా మల్లన్న దేవుని పండుగ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, సత్తన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం మల్లన్నదేవుని పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. సత్తన్‌పల్లిలో బావాపూర్(కే) ఒగ్గుకళాకారుల బృందం ఆధ్వర్యంలో పట్నాలు వేసి పూజలు చేయడంతోపాటు బోనాలు సమర్పించారు. తర్లపాడ్‌లోని సిరిచెల్మ మల్లికార్జునస్వామి ఉత్సవాల సందర్భంగా అగ్నిగుండం సందర్శన, పట్నాలు, బోనాలతోపాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సత్తన్‌పల్లిలో పుట్టవద్ద భక్తులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్టీయూటీఎస్ నాయకులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కోరారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్నయాదవ్, జె.లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాంపల్లి నాగభూషణ్, శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, టి.రమేశ్, ఎస్.గణపతి, ఎన్.రామాగౌడ్, గంగాధర్ బోస్లే, నారాయణ, జాడే లక్ష్మణ్, పోలీస్ కర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయం సమావేశమందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

కుంటాల: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని కుంటాల ఎస్సై హన్మాండ్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్నారా..మీకు పథకాలు మంజూరయ్యాయని మీ ఫోన్‌కు వచ్చినా ఓటీపీని చెప్పమంటే వివరాలు తెలపొద్దని సూచించారు. అపరిచితులు ఫోన్ చేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.